https://teluguislam.net



## గజ్వయె బనీ ముస్తలిక్ తరువాత చేపట్టిన సైనిక చర్యలు

### 1. సరియ్యా దయారె బనీ కల్బ్ (దూమతుల్ జందల్ ప్రాంతం)

ఈ సైనిక పటాలాన్ని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారి సారథ్యంలో షాబాన్ నెల హి.శ. 6లో పంపడం జరిగింది. దైవప్రవక్త (స) ఆయన్ను తన ఎదురుగా కూర్చోబెట్టుకొని స్వయంగా తన చేతి మీదుగా ఆయన తలపై తలపాగా కట్టారు. యుద్ధంలో మేలైన తీరును అవలంబించమని హితవు జేస్తూ, "వారే గనక మీకు విధేయులైపోతే వారి రాకుమార్తెను వివాహమాడండి" అని చెప్పి సాగనంపారు. అచ్చం దైవప్రవక్త (స) గారు చెప్పినట్లే జరిగింది. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) తమాజిర్ బిన్తె అజ్బగ్‌ను వివాహమాడారు. ఆ తరువాత ఈమె అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారి కుమారుడు అబూ సల్మాకు తల్లి అయింది. ఈ మహిళ తండ్రి తన జాతికి చెందిన సర్దారు మరియు రాజు కూడాను.

### 2. సరియ్యా దయారె బనీ సఅద్ (ఫిదక్ ప్రాంతం)

ఈ సైనిక పటాలం హజ్రత్ అలీ (ర) గారి నేతృత్వంలో షాబాన్ నెల హి.శ. 6లోనే పంపబడింది. ఈ సైనిక చర్యకుగల కారణం, బనూ సఅద్ తెగ ఓ యూదుల సైన్యానికి సహాయం అందిస్తూ ఉంది అనే వార్త అందడమే. కాబట్టి దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (ర) గారికి తోడు రెండు వందల సైనికులనిచ్చి పంపించారు. వీరు రాత్రి పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. చివరికి వారికి ఓ వేగులవాడు పట్టుబడ్డాడు. అతను, యూదులకు ఖర్జూరాలు సరఫరా చేసేందుకు సహాయం చేయడానికి సిద్ధపడ్డానన్న విషయాన్ని అంగీకరించాడు. అదేకాకుండా ఆ వేగులవాడు, బనూ సఅద్ ఏ ప్రదేశంలో ప్రోగై ఉన్నారో కూడా తెలిపాడు. హజ్రత్ అలీ (ర), వారిపై రాత్రి పూట దాడి చేసి అయిదువందల ఒంటెల్ని, రెండు వేల మేకల్ని హస్తగతం చేసుకున్నారు. అయితే బనూ సఅద్ తమ భార్యాపిల్లలతో సహా పారిపోవడంలో కృతకృత్యులయ్యారు. వారి సర్దారు పేరు వబ్ర్ బిన్ అలీమ్.

https://teluguislam.net



### 3. సరియ్యా వాదియుర్ ఖురా (ఖురా లోయ)

ఈ సైనిక చర్య హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్ (ర) లేదా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) గారి నేతృత్వంలో రమజాన్ మాసం హి.శ. 6లో పంపబడిన సైనిక చర్య. ఈ సైనిక పటాలాన్ని పంపడానికి గల కారణం, ఫజారా తెగకు చెందిన ఓ శాఖ, మోసంతో దైవప్రవక్త (స)ను హతమార్చే ప్లాను వేయడమే. కాబట్టి మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్ (ర)ను పంపించడం జరిగింది. హజ్రత్ సల్మా బిన్ అకూ (ర) ఆయన వెంట ఉన్నారు. ఆయన కథనం ప్రకారం, "ఈ సరియ్యాలో నేను కూడా ఆయన వెంటే ఉన్నాను. మేము ఫజ్ర్ నమాజు చేసిన తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర) దాడి చేయమని ఆదేశించ గానే మేము వారిపై దాడి చేశాము. అక్కడున్న ఊట బావిని హస్తగతం చేసుకున్నాము. అబూ బక్ర్ (ర) కొందరిని చంపేశారు. నేను, స్త్రీలు పిల్లలు కలిగిన ఓ గుంపును చూశాను. వీరు నా కంటే ముందు కొండపైకి వెళ్ళి పోతారేమోననే అనుమానం కలిగింది నాకు. కాబట్టి నేను వారిపైబడ్డాను. వారికి, కొండకు నడుమన ఉండి వారిపై శరపరంపరలను కురిపించగా వారు అక్కడనే ఆగిపోయారు. ఆ గుంపులో ఉమ్మె ఖర్ఫా పేరు గల ఓ మహిళ కూడా ఉంది. ఆమె పాత చొక్కాను తొడుక్కొని ఉంది. ఆమె వెంట ఆమె కుమార్తె కూడా ఉంది. ఈమె అరేబియాలోనే అతి అందగత్తెగా పేరుగాంచిన స్త్రీ. వారందరినీ అబూ బక్ర్ (ర) దగ్గరకు తీసుకొని వచ్చాను. ఆయన ఆ అమ్మాయిని నాకు బహూకరించారు. కాని నేను ఆమె ముసుగును మాత్రం తొలగించ లేదు."

ఆ తరువాత దైవప్రవక్త (స) ఈ యువతిని హజ్రత్ సల్మా బిన్ అకూ నుండి వేరు చేసి మక్కాకు పంపించారు. ఆమెకు బదులు అక్కడ నివసించే అనేక మంది ముస్లిము ఖైదీలను విడిపించడం జరిగింది.[1]

ఉమ్మె ఖర్ఫా ఓ షైతాను స్త్రీ. దైవప్రవక్త (స)ను హతమార్చడానికి అనేక పన్నాగాలు పన్నేది. దీని కోసమని ఆమె తన కుటుంబానికి చెందిన ముప్పై మంది ఉష్ట్రారోహుల్ని సిద్ధపరిచి ఉంచింది కూడా. దానికి ఆమెకు సరి అయిన ప్రతిఫలమే లభించింది. ఆ ముప్పై మంది ఉష్ట్రారోహులు చంపివేయబడ్డారు.

---

1. *చూడండి, సహీ ముస్లిమ్-2/89; ఈ సరియ్యా హి.శ. 7లో సంభవించింది అని చెప్పుకోవడం కూడా జరిగింది.*

https://teluguislam.net



## 4. సరియ్యా ఉర్‌నియ్యాన్

ఈ సైనిక పటాలం షవ్వాల్ నెల హిజ్రీ శకం ఆరులో, హజ్రత్ కర్జ్ బిన్ జాబిర్ ఫహ్రీ (ర)[2] గారి నేతృత్వంలో పంపబడింది. అక్ల్ మరియు ఉరీనాకు చెందిన కొందరు వ్యక్తులు మదీనాకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. వారు మదీనాలో ఉంటూ ఉండగా అక్కడి వాతావరణం వారికి సరిపడక రోగగ్రస్తు లయ్యారు. దైవప్రవక్త (స) వారికి కొన్ని ఒంటెలనిచ్చి పచ్చికబయళ్ళలలో ఉంటూ ఒంటెల పాలు, దాని మూత్రం త్రాగుతూ ఉండండి అని పంపించారు. వీరు అలా చేసి ఆరోగ్యవంతులయ్యారు. దైవప్రవక్త (స)గారు వారి వెంట పంపించిన కాపరిని హతమార్చి వారు ఒంటెల్ని తోలుకొని వెళ్ళి పోయారు. అంటే, ఇస్లామ్ స్వీకరించిన తరువాత తిరిగి ముర్తిద్‌లు (ధర్మ భ్రష్టులు) అయ్యారన్న మాట. కాబట్టి వారిని పట్టుకోడానికిగాను కర్జ్ బిన్ జాబిర్ ఫహరీ (ర)కి ఇరవై మందిని ఇచ్చి పంపించడం జరిగింది. పోయే టప్పుడు దైవప్రవక్త (స) అల్లాహ్‌ను ఇలా వేడుకున్నారు.

"ఓ అల్లాహ్! ఉర్నీలకు మార్గం అగుపడకుండా చెయ్యి. వారి మార్గాన్ని కష్టతరం చెయ్యి."

అల్లాహ్, ప్రవక్త (స) గారి ఈ దుఆను మన్నించాడు. వారికి మార్గం ఏమీ తోచలేదు. వారు పట్టుబడిపోయారు. వారు ముస్లిమ్ కాపరుల ఎడల అవలంబించిన తీరుకు ప్రతీకారంగా వారి కాళ్ళు చేతులు నరికివేయడం, వారి కళ్ళకు వాతలు పెట్టడం జరిగింది. అలా వారిని హర్రాలోని ఓ మారుమూల ప్రదేశంలో వదిలేయడం వల్ల అక్కడే అంతమైపోయారు.[3]

ఈ సంఘటన హజ్రత్ అనస్ (ర) గారు ఉల్లేఖించినట్లు సహీ బుఖారీ వగైరా గ్రంథాల్లో ఉంది.[4]

సీరత్ చరిత్రకారులు ఆ తరువాత మరో సరియ్యా గురించి రాస్తారు. అది హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), హజ్రత్ సల్మా బిన్ అబీ సల్మా

---

2. బద్ర్ యుద్ధానికి పూర్వం గజ్వయె సఫ్‌వాన్‌లో మదీనా పశువులపై దాడి చేసి వాటిని మక్కాకు తోలుకుపోయిన వర్జ్ బిన్ జాబిర్ ఫహ్‌రీయే ఈయన. ఆ తరువాత ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి మక్కా విజయం సందర్భంగా అమరగతినొందారు.
3. జాదుల్ ముఆద్-2/122
4. సహీబుఖారి 2/602 వగైరాలు.

https://teluguislam.net



(ర)తో కలిసి షవ్వాల్ నెల హిజ్రీ శకం ఆరులో నడిపినట్లుగా చెప్పబడుతోంది. దీని వివరాల్లోనికి వెడితే, హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), అబూ సుఫ్యాన్‌ను హతమార్చే ఉద్దేశ్యంతో మక్కాకు వెళ్ళారు. ఎందుకంటే, అబూ సుఫ్యాన్ ఓ బద్దూ (పల్లెవాసి)ను దైవప్రవక్త (స)ను హతమార్చే ఉద్దేశ్యంతో మదీనాకు పంపించడం జరిగింది. అయితే ఆ ఉభయుల్లో ఏ ఒక్కరూ తాము చేపట్టిన కార్యంలో కృతకృత్యులు కాలేకపోయారు.

అహ్‌జాబ్ యుద్ధం మరియు బనీ ఖురైజా గజ్వా తరువాత చోటు చేసుకున్న సరాయాలు మరియు గజ్వాలు ఇవి. వీటిలో ఎలాంటి భయంకరమైన యుద్ధమూ జరగలేదు. కేవలం మామూలు దాడులు మాత్రమే జరిగాయి. కాబట్టి వీటిని పోరాటాలకు బదులు సైనిక చర్యలుగానే చెప్పుకోవడం సమంజసమైన విషయం. ఇవి కేవలం సైనిక కవాతుల్లాంటివి. వీటి ఉద్దేశ్యం బద్దూలను, శత్రువులను భయభీతులు చేయడమే అని చెప్పవచ్చు. ఆ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, అహ్‌జాబ్ యుద్ధం తరువాత వాటిలో మార్పు రావడం గమనించవచ్చు. ఇస్లామ్ విరోధుల ధైర్యాలు దెబ్బతిన సాగాయి. ఇక ఇస్లామ్ ప్రాభవాన్ని భంగపరిచి ఇస్లామీయ ప్రచారాన్ని అడ్డుకోవడంలో ఎలాంటి ఆశ వారిలో మిగిలిలేదు. కాని ఈ మార్పు ప్రస్ఫుటంగా అగుపించింది ముస్లిములు హుదైబియా ఒప్పందం చేసుకున్నప్పుడు మాత్రమే. ఈ ఒప్పందం అసలు ఇస్లామీయ శక్తిని గుర్తించి చేసుకున్న ఒప్పందం. ఆ కాలంలో ఈ శక్తికి అరేబియా ద్వీపకల్పంలో వ్యాపింపజేయకుండా ఉండడానికి ఏ శక్తీ అడ్డుకోజాలదు అనే యదార్థాన్ని చాటి చెప్పిన ఒప్పందం అది.